క్లుప్తంగా

ముగిసిన ధార్మిక ప్రవచనాలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరంలో తిరుమల తిరుపతి దేవస్థానం, హిందు ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రామాలయంలో నిర్వహించిన ధార్మిక ప్రవచనాలు శనివారం ముగిశాయి. భజన భక్తి మండలితో భజనగీతాలు, కుంకుమార్చన, గోపూజ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. టీటీడీ హిందు ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ధర్మప్రచార సభ్యులు వీరాంజనేయరావు, ఆలయ ధర్మకర్త వీరగంధం బ్రహ్మయ్య, అర్చకులు నరసింహ, ప్రసాద్ శర్మ, గోపాలక్రిష్ణయ్య, వేణుగోపాల్, పుల్లయ్యానాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, సీతమ్మ, పార్వతి, భాగ్యమ్మ, ఉమ, అక్షరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయంలో హారతిస్తున్న అర్చకుడు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాధిత మహిళకు ఆర్థిక సాయం



బోయ లక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

దొర్నిపాడు: ఇటీవల విద్యుదాఘాతంతో ఇల్లుకాలి సర్వం కోల్పోయిన బోయ లక్ష్మి కుటుంబానికి వాల్మీకి సంఘం అండగా నిలిచింది. సంఘం మండల ప్రెసిడెంట్ జమ్ముల రామదాసు, మండల కార్యదర్శి బాలహుసేన్ ఆధ్వర్యంలో శనివారం రూ.5,300 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో చాకరాజువేముల గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలదాసు, ఉపాధ్యక్షుడు అంజనేయులు, కార్యదర్శి బాలయ్య, దొర్నిపాడు గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి క్రిష్ణయ్య, బుర్రారెడ్డిపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నాగేష్, కార్యదర్శి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఆడపిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ సీఐ జయరాముడు, పట్టణ సీఐ చిరంజీవీ అన్నారు. పట్టణ శివారులోని బాలికల గురుకుల పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఏదైనా ఆపద సమయంలో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి పోలీస్ వారి తక్షణ సహాయాన్ని పొందవచ్చన్నారు. వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా ద్వారా ఇతరులతో పంచుకోవద్దన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐలు నగీన, జయప్ప ఉన్నారు

5న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5వతేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.శశికళ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకుంటారన్నారు. ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు జీతం ఉంటుందన్నారు. 18 నుంచి 28 సంవత్సరాలలోపు వయస్సు కలిగి పది ఆపై విద్యార్హత ఉన్న అభ్యర్థులు మేళాకు హాజరుకావాలన్నారు.



దొర్నిపాడు.. క్రిష్టిపాడులోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నంద్యాలలో ప్రథమనందీశ్వరుడికి అభిషేకం చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

ఊరూరా కార్తీక శోభ

మహాశివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం ప్రారంభమైంది. తొలిరోజు శనివారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి బోళాశంకరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగలమర్రిలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి శివరామానంద స్వామి కార్తీక మాస ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించి, ధ్వజస్తంభంపై ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణంలో ప్రథమనంది, నాగనంది, సోమనందీశ్వర ఆలయంతో పాటు భీమలింగేశ్వర ఆలయం, బ్రహ్మనందీశ్వర ఆలయం, మల్లికార్జునస్వామి దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ప్రథమనంది ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

–దొర్నిపాడు/చాగలమర్రి/నంద్యాల(వ్యవసాయం)



చాగలమర్రి.. పాత శివాలయంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేస్తున్న శివరామానందస్వామి



చాగలమర్రి.. విద్యుత్ దీప అలంకరణలో పాత శ్రీరామలింగేశ్వరాలయం

యాజమాన్య పద్ధతులతో తెగుళ్ల నివారణ



ఇంజేడులో రైతులతో కలిసి మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారిణి

ఉయ్యాలవాడ : మిరప పంట సాగు చేసిన రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని కోవెలకుంట్ల ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి సూచించారు. శనివారం మండలంలోని ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో రైతులతో కలిలి క్షేత్రస్థాయిలో మిరప పంటను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిరపలో అధికంగా తేమ ఉండడంతో తెగుళ్లు సోకే ప్రమాదం ఉందన్నారు. మొక్క ఎదుగుదల కోసం లీటర్ నీటికి మూడు గ్రాములు 19-19-19, 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. వేరు కుళ్లు తెగుళ్ల నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము కార్బన్‌డిజమ్, రెండు గ్రాముల మాంకోజెట్ కలిపి మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. పోషకాల్లో భాగంగా మొక్కలకు 15 కిలోల పొటాష్, 200 కిలోల వేపపిండి పంటలో ఎత్తాలన్నారు. ఈమె వెంట గ్రామ వ్యవసాయ సహాయకురాలు వసుంధర పాల్గొన్నారు.

రహదారులను అభివృద్ధి చేస్తాం

నంద్యాల(అర్బన్): దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు వద్ద మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమం కింద రహదారి మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు గుంతలు లేని రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ గేటు నుంచి శ్రీనివాసనగర్ జంక్షన్ వరకు గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లోని గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం రూ.4.57 కోట్లను మొదటి విడతగా మంజూరు చేసిందన్నారు. వచ్చేఏడాది జనవరి 15వ తేదీలోపు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 369 కిలోమీటర్ల రహదారిలో గుంతలు పూడ్చనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్, మున్సిపల్ రోడ్ల పనులకు నిధులు మంజూరు కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, తదితర ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది



ఆహార పదార్థాలు వడ్డిస్తున్న మంత్రి, కలెక్టర్

నంద్యాల (వ్యవసాయం): అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. కార్తీకమాసం సందర్భంగా ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం గుడిపాడు గడ్డలోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో శివస్వాములు, అయ్యప్పమాలధారుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి ప్రారంభించారు. ముందుగా వారు ఆలయంలో అభిషేకలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మంత్రి మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగిశెట్టి శ్రీధర్, కల్లూరి రామలింగారెడ్డి జనార్దన్ రామచంద్ర రావు, శ్యాంసుందర్, విజయశేఖరరెడ్డి, ఈఓ రామానుజన్, దాతలు రామశివారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

- ఎలాంటి లోపం లేకుండా లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి చేపట్టాలి
- కార్తీక మాసోత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో ఇన్‌చార్జ్ ఈఓ



క్షేత్ర పరిధిలో కార్తీక మాసోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ



ప్రత్యేక విధులపై పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రామాంజినాయక్

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శ్రీశైల మహాక్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు దేవస్థాన ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి ఇ.చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం ఆయన క్షేత్ర పరిధిలోని ఆలయ మాఢవీధులు, ఆలయ పుష్కరిణి, అన్నప్రసాద వితరణ, పాతాళగంగ, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ ఉత్తర మాఢవీధి, గంగాధర మండపం వద్ద భక్తులు కార్తీక దీపాలను వెలిగించుకునేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేకుండా పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పుష్కరిణి వద్ద లైటింగ్, విద్యుదీపాలంకరణ ఆకర్షణీయంగా ఉండాలని ఆదేశించారు. పాతాళగంగ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని చెప్పారు. ఈ పరిశీలనలో దేవస్థాన ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం.నరసింహారెడ్డి, ఏఈలు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భారీ పోలీసు బందోబస్తు

కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. శనివారం ఉదయం శ్రీశైలంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ పరిధిలో జరిగిన సమావేశంలో కర్నూలు, నంద్యాల, నందికొట్కూరు తదితర నియోజకవర్గాల నుంచి సుమారు 300 మంది పోలీసులు ప్రత్యేక విధులపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, శ్రీశైలానికి వచ్చే రహదారి ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వారికి దశ దిశ నిర్దేశం చేయాలని పోలీసు సిబ్బందిని సూచించారు. దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూడా ప్రత్యేక విధులపై నైపుణ్యం గల పోలీసులను నియమిస్తున్నామని అన్నారు. ఇప్పుడు ఎక్కడ, ఎలాంటి సంఘటన జరిగినా వైర్‌లెస్ సెట్‌ల ద్వారా వెంటనే సమాచారం సంబంధిత అధికారులకు తెలియజేయాలని చెప్పారు. వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ప్రసాద్‌రావు, చంద్రబాబు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

భజనలు ప్రారంభం

లోకకల్యాణం కోసం ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో దేవస్థానం శివచతుస్సప్తాహ భజనలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా శనివారం కార్తీక మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా నిర్వహించిన ప్రారంభ పూజల్లో ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. ముందుగా అర్చకులు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా చండీశ్వరస్వామివారికి విశేషపూజలు జరిపించారు. అనంతరం శివప్రణవ పంచాక్షరీనామ అఖండ భజన ప్రారంభించారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన రెండు భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన నాలుగు భజన బృందాలకు అవకాశం కల్పించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం

శిరివెళ్ల: మండల పరిధిలోని రెండు కేసీ కెనాల్ సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. 28, 29 నెంబర్ల సాగునీటి సంఘాలకు టీసీలు (మెంబర్లు) ఎన్నికకు ఓటర్లు (రైతులు) సిద్ధం చేసి గ్రామ పంచాయతీల వద్ద రైతులకు అందుబాటులో ఉంచారు. 28 సంఘం కింద గోవిందపల్లె, కామినేనిపల్లె, శిరివెళ్లలోని కొంత మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. అలాగే 29వ సంఘం కింద యర్రగుంట్ల, వీరారెడ్డిపల్లె, కోటపాడు వెంకటాపురం, శిరివెళ్లలోని కొంత మంది రైతులు ఓటర్లుగా ఉన్నారు. సాగునీటి సంఘంలో 12 మంది టీసీలు (మెంబర్లు) ఉంటారు. ఒకొక్క టీసీకి 200 నుంచి 250 మంది ఓటర్లు ఉంటారు. మొదట టీసీ ఎన్నిక జరుగుతుంది. 12 మంది టీసీల ఎన్నిక అనంతరం వారిలో మెజార్టీ టీసీల ఆమోదంతో సంఘంకు చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. ఈ ఎన్నిక మండల కేంద్రం కార్యాలయాల్లో జరుగుతుంది.

ఉపాధి కల్పనే ధ్యేయంగా పోరాటం

నంద్యాల, న్యూటౌన్: ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా డీవైఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందని ఆశాఖ పట్టణ కార్యదర్శి శివ ,ఉపాధ్యక్షుడు సాయి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో44వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ జాతి ఐక్యత కోసం మతోన్మాదాన్ని ఎదురించిన సంఘం తమదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేటర్లకు ధారదత్తం చేసుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా , కడప ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. నాయకులు ప్రసాద్, హరి, బన్ని, డేవిడ్ బాషా, కిరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

11న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నంద్యాల(అర్బన్): దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 11న పట్టణంలోని ముల్లాన్‌పేట మున్సిపల్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబిహా పర్వీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవిత చరిత్ర, వారి సేవలు అనే అంశంపై జిల్లాలోని వివిధ ఉర్దూ పాఠశాలలకు చెందిన 6 నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన విద్యార్థులకు అదే రోజు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేస్తామని వెల్లడించారు.

ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించండి

ఉయ్యాలవాడ : గ్రామాల్లో ప్రజలు ఇంకుడు గుంతలు తవ్వుకునేలా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షపు నీరు వృథా కాకుండా మండలానికి 1000 ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

రోడ్లు ఇలా..వెళ్లేదెలా!



అధ్వానంగా శిరివెళ్ల- చిన్న కంబలూరు మెట్ట రోడ్డు

శిరివెళ్ల: మండలంలో రెండు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. శిరివెళ్ల మెట్ట నుంచి గోస్పాడు మండలం యాళ్లూరు వరకు ఉన్న 6 కిలో మీటర్ల రోడ్డు, శిరివెళ్ల నుంచి రుద్రవరం మండలం చిన్న కంబలూరు మెట్ట వరకు ఉన్న 3 కిలోమీటర్ల రోడ్డు మోకాళ్లలోతు గుంతలతో ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులకు రూ. 33 లక్షలు మంజూరు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు అతీగతీ లేదు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి



పోలూరులో మాట్లాడుతున్న రామచంద్రారావు



వెంగంపల్లె సభలో మాట్లాడుతున్న తహసీల్దార్

నంద్యాల(అర్బన్): రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు అన్నారు. శనివారం మండలంలోని పోలూరులో గ్రామ సభ నిర్వహించారు. ఇందులో 112 మంది రైతులు భూ సంబంధ అంశాలపై దరఖాస్తులు ఇచ్చారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 11 వరకు గ్రామ సభలు జరుగుతాయని డీటీ వెల్లడించారు.

వెంగంపల్లెలో 173.486 ఎకరాల ప్రభుత్వ భూమి

ఉయ్యాలవాడ : మండలంలోని రెవెన్యూ గ్రామమైన వెంగంపల్లెలో గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో 173.486 ఎకరాల ప్రభుత్వ భూమి, 9.613 ఎకరాల దేవాలయాల భూములు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. 527 మంది రైతులకు చెందిన 2120.75 ఎకరాల్లో భూ సర్వే చేయడం జరిగిందన్నారు. 115 మంది రైతులు పొలం విస్తీర్ణంలో తేడాలు, ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని అర్జీలు అందజేశారన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజమయలక్ష్మి, వీఆర్‌ఓ లక్ష్మి చెన్నప్ప, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం



మాలాధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రి పాత బస్టాండు సమీపంలోని అయ్యప్పాస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్వామి దీక్షపరులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దాతలు, ప్రముఖులు జూటూరు రవికుమార్, శ్రీనివాసులు, మోహన్‌రావు, మైలారు చిన్నవెంకటయ్య, మైలారు శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1999వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఏటా ఆలయంలో కార్తీక మాసం ప్రారంభం నుంచి 41 రోజుల పాటు దీక్షపరులకు అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. భక్తుల సహకారంతో వచ్చే ఏడాది జనవరి 25వతేది వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మదళ్లపల్లె లక్ష్మీనారాయణ, అయ్యప్పస్వామి సేవా సమాజం అధ్యక్షుడు సుంకు జనార్దనరావు, కోశాధికారులు తోమ్మండ్రు విద్యాసాగర్, వందవాసి నరేంద్రకుమార్, మలిపెద్ది సుబ్రమణ్యం, కార్యదర్శులు కె.నాగభూషణం, యల్లంపల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ టోర్నీ ప్రారంభం



త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని శ్రీ గురురాజా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెమోరియల్ త్రోబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఈపోటీలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా మైదానంలో ఏర్పాటు చేసిన టోర్నీ జెండా, క్రీడా పతాకాలను అతిథులు ఎగురవేశారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో 100కు పైగా త్రోబాల్ జట్లు పాల్గొనగా క్రీడాకారులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ అందరినీ ఆకట్టుకుంది. శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా పరిశ్రమల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ రెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జి రవికృష్ణ, విద్యావేత్తలు రామకృష్ణారెడ్డి, కొండారెడ్డి హాజరయ్యారు.

ఆత్మలకు శాంతి చేకూరాలని..

- ఘనంగా సమాధుల పండుగ



చాగలమర్రి ఆర్‌సీఎం చర్చి సమీపంలో సమాధులను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

చాగలమర్రి: మండలంలో శనివారం సమాధుల(ఆత్మల) పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మృతి చెందిన వ్యక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ శ్మశానవాటికలకు చేరుకుని సమాధులను రంగులు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. చాగలమర్రి ఆర్‌సీఎం చర్చి, ముత్యాలపాడు గ్రామంలోని ఎస్‌పీజీ శ్మశానవాటికలో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెవ.సంజీవరాజ్ మాట్లాడుతూ బతికిన కాలంలో చిన్న చిన్న తప్పులు చేసి మృతి చెందిన వ్యక్తులు స్వర్గానికి, నరకానికి మధ్యలో ఉండిపోతారని అటువంటి వారి ఆత్మలు దైవ సన్నిధికి చేరడానికి ప్రతి ఏటా నవంబర్ 2వ తేదీన ఆత్మల దినోత్సవం జరుపుకుంటారన్నారు.